

• ధర్పల్లి ప్రాంతంలో ఈదురు గాలులతో వంగిన వరి పంట

అన్నదాత ఆగమాగం



• వర్షం నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యం

రాత్రి కురిసిన రాళ్ల వర్షం వల్ల రాలిన వరి పంట

- ఓ వైపు అకాల వర్షాలు మరోవైపు ఎండలు
- చేతికొచ్చిన పంట నష్టపోయి ఇబ్బందులు పడుతున్న రైతులు
- వెయ్యికి పైగా ఎకరాల్లో ఎండిన పంటలు
- వెయ్యికి పైగా ఎకరాల్లో అకాల వర్షాలతో పంట నష్టం



నిజామాబాద్ అర్బన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల పరిస్థితి ఆగమాగం అవుతోంది. గత రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. జిల్లాలో కురిసిన వడగండ్ల వాన చేతికొచ్చిన పంటలను దెబ్బతీయగా మరోవైపు ఎండ తీవ్రత వల్ల భూగర్భజలాలు తగ్గి నీరులేక పంటలు ఎండిపోయిన పరిస్థితులు ఉన్నాయి. ఓ వైపు ప్రకృతి సృష్టించిన బీభత్సంతో పంటలు నష్టపోతుండగా మరో వైపు ప్రకృతితాపంతో పంటలు నష్టపోతున్న పరిస్థితులు ఉన్నాయి. చేతికొచ్చిన పంటతో లాభాలు చూడాల్సిన రైతులు వడగండ్ల వానతో పంటలు నేలపాలై నష్టాన్ని చూడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో సుమారు వెయ్యి ఎకరాల వరకు అకాల వర్షాలతో పంట నష్టం జరుగగా వెయ్యి ఎకరాలకు పైగా జిల్లాలో సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంది. భూగర్భజలాలు తగ్గిపోతుండటంతో జిల్లాలో చాలాచోట్ల చేతికొచ్చిన పంట ఎండిపోతోంది. అధికారుల లెక్కల ప్రకారం 800 ఎకరాలకు పైగా వరిపంట నీటిఎద్దడితో ఎండిపోయినట్లు చెబుతున్నప్పటికీ జిల్లాలో 2వేల ఎకరాలకు పైగా పంటలు ఎండిపోయినట్లు తెలుస్తోంది. నిజాం సాగర్ చివరి ఆయకట్టు ప్రాంతంలో సాగునీరు అందక వరి పంట ఎండిపోయింది. చివరి దశలో నీరు విడుదల చేసి పంటలను ఆదుకోవాలని రైతులు కోరిన చివరి ఆయకట్టు వరకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. ఆలస్యంగా వేసిన వరిపంటలు చివరి దశలో సాగు నీరు అందక ఎండిపోతున్నాయి. బోరు బావులు సైతం భూగర్భ జలాలు తగ్గి ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు ఎండలతో రైతుల పరిస్థితి ఆగమాగం అవుతోంది. చేతికొచ్చిన పంటలు ఎండిపోయి ఒకవైపు, రాళ్లవర్షంతో వరిపంట రాలిపోయి మరోవైపు రైతుల పరిస్థితి దీనంగా ఉంది.

పంట నష్టం వెయ్యి ఎకరాలకు పైనే..

జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో వెయ్యి ఎకరాలకు పైనే పంటనష్టం జరిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సిరికొండ, ధర్పల్లి మండలాల్లో కోతకు వచ్చిన వరిపంట వడగండ్ల వానతో పూర్తిగా నేలమట్టమైంది. వడగండ్ల వానకు ధాన్యం రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కోతలు కోసిన ధాన్యం సైతం కళ్లాల్లో ఆరబెట్టగా అకాల వర్షం వల్ల ధాన్యం పూర్తిగా తడిసిపోయిన పరిస్థితి నెలకొంది. మామిడిపంటతోపాటు మొక్కజొన్న పంట సైతం అకాల వర్షం వల్ల నష్టపోయినట్లు అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఆర్మూర్, నందిపేట్, డొంకేశ్వర్ తదితర ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షాల వల్ల వరిపంట తీవ్రంగా నష్టపోయినట్లు తెలుస్తోంది. గత రెండు రోజులుగా జిల్లాలో కురిసిన రాళ్లవర్షం, అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాలు ఉన్నాయనే కారణంతో కొంత మంది రైతులు ముందస్తుగానే కోతలుకోయగా కళ్లాలలో ఆరబెట్టిన ధాన్యం సైతం తడిసిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో అకాల వర్షాలతో 842 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. వరి పంట 33శాతానికి పైగా 732 ఎకరాల్లో నష్టం జరిగినట్లు, 110 ఎకరాల్లో 33శాతం కంటే తక్కువగా నష్టం జరిగినట్లు అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. మొక్కజొన్న 42 ఎకరాల్లో 33 శాతం కంటే తక్కువగా నష్టం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ధర్పల్లి మండలంలో 300 ఎకరాలకు పైగా, సిరికొండ మండలంలో 500 ఎకరాలకు పైగా పంటనష్టం జరిగినట్లు తెలుస్తుంది.

చివరి దశలో ఎండుతున్న పంటలు..

జిల్లాలో గత వర్షాకాలంలో సాధారణానికి మించి వర్షం కురిసిన యాసంగి పంటకు బోరుబావుల్లో, చెరువుల్లో నీరుతగ్గడంతో చివరిదశలో పంటలు ఎండిపోతున్నాయి. జిల్లాలో వరిసాగు యాసంగిలో 4లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. గత వర్షాకాలంలో పండిన వరిసాగుకు దీటుగా యాసంగిలోనూ రైతులు వరిసాగుకు మొగ్గు చూపడంతో చాలాచోట్ల సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. జిల్లాలోని సిరికొండ, ఇందల్వాయి, ధర్పల్లి, బాల్కొండ, డిచ్‌పల్లి, బోధన్, నవీపేట్, తదితర ప్రాంతాల్లో వరిపంట ఎక్కువగా ఎండిపోతున్నాయి. భూగర్భ జలాల మట్టం రోజురోజుకు తగ్గిపోతుండటం, ఎండ తీవ్రత పెరుగుతుండటంతో చివరి దశలో ఉన్న వరిపంట ఎండిపోతోంది. దీంతో దిగుబడి వస్తుందని అనుకుంటున్న రైతులు తీవ్రఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా వరిపంట ఎండిపోయినట్లు తెలుస్తోంది. నిజా మాబాద్ రూరల్ మండలంలోని మోపాల్, మంచిప్ప తదితర ప్రాంతాల్లో వంద ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోయినట్లు తెలుస్తోంది. ఆర్మూర్ ప్రాంతంలో భూగర్భజలాలు తగ్గడంతో వరిపంట ఎండిపోతుంది. గుత్ప, అలీసాగర్ ఆయకట్టు రైతాంగం ఆ ప్రాజెక్టుల యొక్క నీటి విడుదల పైనే ఆధారపడి పంటలు వేయగా నీటిని విడుద ల చేసినప్పటికీ చివరి ఆయకట్టు వరకు నీరు అందక వరి పంట ఎండిపోతుంది. దీంతో ఎక్కువ దిగుబడి వచ్చి లాభాలు చూస్తామనుకుంటున్న రైతులు సాగునీరు అందక చివరిదశలో పంటలు ఎండిపోయి ఇబ్బందులు పడుతున్నారు.



దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న రైతు



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న సీపీ సాయి చైతన్య

బెట్టింగ్ యాప్‌లకు ప్రజలు దూరంగా ఉండాలి

- బెట్టింగ్ యాప్‌ల బారిన పడి కుటుంబాలను నాశనం చేసుకోవద్దు
- పోలీసు కమిషనర్ సాయిచైతన్య

ఖిల్లా, మార్చి22 (ఆంధ్రజ్యోతి): సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో చాలా మంది బెట్టింగ్ యాప్‌ల బారినపడి కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారని, వీటికి దూరంగా ఉండాలని పోలీసు కమిషనర్ సాయిచైతన్య ప్రజలు కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జిల్లాలోని వడ్డెపల్లి గ్రామంలో చోటుచేసుకున్న విషాద ఘటనను ఆయన ప్రస్తావిస్తూ ప్రజలకు బెట్టింగ్‌యాప్ మోసాలపై వివరించారు. బెట్టింగ్‌యాప్ బారిన పడిన వడ్డెపల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు బలవర్మణం చేసుకోవడం దురదుష్టకరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులతోపాటు 23 ఏళ్ల వయసున్న యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌యాప్ వల్ల ప్రాణాలు కోల్పోయిన ఘటన వివరించారు. ఈజీమనీ వస్తుందనే ఆశతో బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పెట్టడం మొదలుపెట్టి లాభాల కంటే నష్టాలే ఎక్కువరావడంతో కుటుంబం అప్పుల పాలైందని తెలిపారు. కుటుంబానికి అప్పులు భారంగా మారడంతో వారికిఉన్న ఆస్తిఅమ్మి సమస్యను పరిష్కరించుకోవాలని భావించినట్లు తెలిపారు. అయినా సమస్య పరిష్కరించకపోవడంతో ఆర్థిక ఒత్తిడితో, మానసిక బాధతో ముగ్గురు ఒకేసారి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మొదట్లో ఈకేసును ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య అని నమోదు చేసిన పోలీసులు ఇది సామాజిక ప్రమాదంగా భావించారు. ఫేక్ ప్రమోషన్లతో యువతను మోసంచేస్తూ, వారి జీవితాలతో ఆడుకుంటున్న బెట్టింగ్‌యాప్‌ల మోసాలను గుర్తించిన పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకుందని పేర్కొన్నారు. కేసును తిరిగి పరిశీలించి అసలు కారాణాలపై విచారణ జరిపిందని, దర్యాప్తులో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆత్మహత్యకు ప్రేరేపించడంపై డిజిటల్‌ప్లాట్‌ఫారంల ద్వారా మోసం చేయడంపై చర్యపరమైన చర్య కాదని తెలిపారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన సీపీ

పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న పరీక్ష కేంద్రాలను శనివారం పోలీస్ కమీషనర్ సాయిచైతన్య పరిశీలించారు. పరీక్షలకు సంబంధించి నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా, లోపాలు ఉండకుండా పర్యవేక్షణ చేయాలని అన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ 2023 అమల్లో ఉంటుందని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రానికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని అన్నారు. స్పాట్ వాల్యుయేషన్ జరుగుతున్న నిర్మల హృదయ స్కూల్‌ను సందర్శించారు. ఆయన వెంట నగర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రాజ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రఘునాథ ఆలయ అభివృద్ధికి రూ.20కోట్లు ఇవ్వండి

- అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రఘునాథ ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్ల నిధులు ఇవ్వాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇందూరు పట్టణంలో సుమారు వెయ్యి ఏళ్ల చరిత్ర ఉన్న రఘునాథ ఆలయం ప్రస్తుతం శిథిలావస్థలో ఉందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాలైన వేములవాడ రాజన్న దేవాలయం, యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, రాష్ట్రంలో ఉన్న అనేక దేవాలయాలలాగే చారిత్రాత్మిక వైభవం, ఆధ్యాత్మిక చింతనకు చిహ్నంగా ఉన్న ఖిల్లా రామాలయంలో రాములవారిని దర్శించుకోవడానికి ఉత్తర తెలంగాణలోని భక్తులతోపాటు మహారాష్ట్ర ప్రాంతంలోని భక్తులు వేలసంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటారని అన్నారు. ఎన్నోఏళ్ల చరిత్ర కలిగిన రామాలయ అభివృద్ధికి రూ.20కోట్లు నిధులు చెల్లించాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఖిల్లా రామాలయ అభివృదికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

డిచ్‌పల్లి: శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్‌లో ఖిల్లా డిచ్‌పల్లి రామాలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ రూరల్‌ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఖిల్లా డిచ్‌పల్లి ప్రసిద్ధ రామాలయం బాసర పుణ్యక్షేత్రానికి వెళ్లే మార్గ మాద్యంలో ఉంటుందని, శ్రీరాంసాగర్ తీర ప్రాంతం, బాస, ఖిల్లా డిచ్‌పల్లిని ఒక బెల్టుగా తీసుకొని పర్యటక కేంద్రాలు అభివృద్ధి పర్చాలని, ఖిల్లా రామాలయ అభివృద్ధి చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.



గ్రామాల్లో జోరుగా కల్తీకల్లు విక్రయాలు

7

- కల్తీ కల్లుకు బానిసవుతున్న యువత
- మత్తు పదార్థాలతో శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్న వృద్ధులు
- పట్టించుకోని అధికారులు

దెబ్బతిన్న పంట వివరాలను సేకరించాలి

- రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్



నిజామాబాద్ అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను మండలాల వారిగా పకడ్బందీగా సేకరించాలని అన్నారు. అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న రైతులను ఆదుకుంటామని సీఎం ప్రకటించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు అప్రమత్తమై పకడ్బందీగా వివరాలు సేకరించాలని ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండాలని కోరారు.



పాస్‌పోర్టుకు కొర్రీలు!

- ఒక్కో పాస్‌పోర్ట్‌కు ఒక్కో రేటు
- పీసీసీకి మరో రేటు
- ఏళ్లుగా ఒకే విభాగంలో ఇష్టారీతిన విధులు
- రూల్స్ మాట్లాడితే పెండింగ్‌లో పాస్‌పోర్ట్
- వీసా గడువు ముగిసినా జారీ చేయని వైనం
- డబ్బులు ఇవ్వనిదే కదలని పాస్‌పోర్ట్ ప్రక్రియ
- కోర్టు కేసులో ఉన్న వ్యక్తికి పాస్‌పోర్ట్ జారీ

ఖిల్లా, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పాస్‌పోర్ట్ తీసుకునే వారికి పోలీసు శాఖలోని ఎస్‌బీ విభాగం సిబ్బంది చుక్కలు చూపిస్తున్నారు. వారు చెప్పినంత ముట్టచెబితేనే సకాలంలో విచారణ చేసి పాస్‌పోర్ట్ జారీచేయడానికి సిద్ధమవుతున్నట్లు పలు ఆరోపణలు విన్పిస్తున్నాయి. పాస్‌పోర్ట్‌ను బట్టి ధరలు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వేళ్లే నిరుద్యోగ యువతకు పాస్‌పోర్ట్ జారీచేయడంలో నానా కొర్రీలు పెడుతున్నారు. ఒక్కో పాస్‌పోర్ట్‌కు ఒక్కోవిధంగా ధరలు నిర్ణయించి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. రూల్స్ మాట్లాడితే ఇక అంతే సంగతి పాస్‌పోర్ట్ పెండింగ్‌లో పడిపోవాల్సిందే. వీసా వచ్చిన వారు కొత్తగా పాస్‌పోర్ట్ తీసుకోవాలంటే సవాలక్ష సవాళ్లు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. పోలీసు కమిషనరేట్ పరిధిలోని మూడు డివిజన్లలో ఆర్మూర్ డివిజన్ నుంచి నిరుద్యోగ యువకులు పెద్దఎత్తున ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వలస వెళ్తుంటారు. వారికి అత్యవసర సమయంలో పాస్‌పోర్ట్ సకాలంలో జారీ కావాల్సి ఉండగా సిబ్బంది నిర్వాకం వల్ల పాస్‌పోర్ట్ జారీలో తీవ్ర జాప్యం జరుగుతుందని బాధితులు లబోదిబో మంటున్నారు. అన్ని సక్రమంగా ఉండి పాస్‌పోర్ట్ ధరకాస్తు చేసుకున్న విచారణ పేరుతో ఎస్‌బీ సిబ్బంది నానా ఇబ్బందులు పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సకాలంలో పాస్‌పోర్ట్ జారీ కాకపోవడంతో వీసా గడువు ముగిసి నష్టాలపాలవుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త పాస్‌పోర్ట్‌తో పాటు పీసీసీ(పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్) కోసం సంబంధిత ఎస్‌బి విభాగాధికారులకు ధరఖాస్తు చేసుకున్న సిబ్బంది సర్టిఫికెట్ జారీ చేయడానికి నానా కొర్రీలు పెడ్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువత ఎస్‌బీ సిబ్బంది పెట్టే బాధలు భరించలేక గల్ఫ్ వెళ్లడానికి అప్పులు తెచ్చిన డబ్బులు నష్టపోతామనే భయంతో సిబ్బంది చెప్పినంత ముట్టచెబుతున్నారు. ఒక్కో పాస్‌పోర్ట్‌కు రూ.500 నుంచి రూ2000 వరకు సిబ్బంది వసూలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు.

విచారణ పేరుతో ఇబ్బందులు

పాస్‌పోర్ట్ విచారణ పేరుతో గ్రామీణ నిరుద్యోగ యువకుల జీవితాలతో ఎస్‌బి సిబ్బంది ఆడుకుంటున్నారు. విచారణ అధికారి సదరు వ్యక్తికి సంబంధించి విచారణ చేయడానికి ఆయన ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాల్సి ఉంటుంది. కాని మండల కేంద్రంలో అధికారి ఉండి ఆ గ్రామ సర్పంచ్ ద్వారా వ్యక్తి వివరాలు తెలుసుకుంటాడు. అనంతరం పీసీసీ, పాస్‌పోర్ట్ కావల్సిన వ్యక్తిని మండల కేంద్రానికి రప్పించుకుంటాడు. తనకు అనుకూలంగా లేని వ్యక్తి అయి ఉంటే సర్పంచ్ మాటపై ఆ వ్యక్తికి పాస్‌పోర్ట్ జారీ చేయడంలో లేనిపోని కొర్రీలు చూపి పాస్‌పోర్ట్ రాకుండా అడ్డంకులు పెడ్తారు. విచారణకు వచ్చిన ఎస్‌బి అధికారి ధరఖాస్తుదారుడితో వ్యవహరించే తీరు కూడా ప్రశ్నార్థకంగా ఉంటుంది. ధరఖాస్తుదారుడికి ఎటువంటి మర్యాద ఇవ్వడం కాని పాస్‌పోర్ట్‌కు సంబంధించిన ధృవీకరణ పత్రాలు చూడడం కన్న ఆయన ఇచ్చే డబ్బుపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతాడు.

పీసీసీ జారీకి అదనంగా డబ్బు వసూలు

కొన్నిదేశాల్లో వీసా పొందాలంటే పోలీసు క్లీయరెన్స్ సర్టిఫికెట్ తప్పనిసరిగా అవసరమవుతుంది. పీసీసీ లేనిదే ఆ దేశానికి వెళ్ల లేని పరిస్థితి ఉంటుంది. దీంతో ధరఖాస్తు దారులు పాస్‌పోర్ట్‌తో పాటు పీసీసీ కోసం పోలీసు శాఖకు ధరఖాస్తు చేసుకుంటాడు. కాని పోలీసు శాఖ సదరు (తరువాయి 8వ పేజీలో..)



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.34 (ఆదివారం సాయంత్రం)

సహర్ : 4.55 (సోమవారం ఉదయం)

తల్లిదండ్రులు తమ సంతానానికి బహూకరించే వాటన్నింటిలోను శ్రేష్టమైన, ఉత్తమమైన కానుకల్లో ఉత్తమైనది చదువు సంస్కారాలే.

అష్ట ఐశ్వర్యాలు కావాలంటే సూర్యుడిని ఉపాసించాలి

7

ప్రొసీడింగ్‌లను అందజేసిన మున్సిపల్ కమిషనర్



ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్‌లను అందజేసిన మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, మార్చి22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం పలువురికి మున్సిపల్ కమిషనర్ రాజు ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారు వాటిని క్రమబద్ధికరించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం 25శాతం డిస్కౌంట్ ఇచ్చిందని, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటి వరకు 322మంది దరఖాస్తుదారులు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును చెల్లించారని తద్వారా మున్సిపల్‌కు రూ.కోటి 80లక్షల రావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీవో అంజనేయులు, కంప్యూటర్ ఆపరేటర్ ప్రభాకర్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బోర్లకు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలి



టాక్లీలో పొలంబాట నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు

కోటగిరి,మార్చి22(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ బోర్లకు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని రుద్రూరు ఏడీఈ నగేష్ కుమార్ సూచించారు. పొతంగల్ మండలంలోని టాక్లీ గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ నగేష్ కుమార్ మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో విద్యుత్ మోటర్లు, స్టార్టర్లు, పీవీసీ పైపులు ఐఎస్ఐ నాణ్యతతో ఉండేలా చూసుకోవాలన్నారు. మోటార్ స్టార్టర్లకు ప్లాస్టిక్ డబ్బాలు ఉపయోగించాలని, ఇనుప పరికరాలకు మోటార్లకు ఎర్తింగ్ చేసుకోవాలని సూచించారు. తద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చన్నారు. విద్యుత్ సమస్యలు ఉంటే రైతులు తమ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు మార్చడం, విద్యుత్ పరికరాలు రిపేర్ చేయడం వంటి పనులు చేపట్టరాదన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి తమకు సమాచారం అందించాలని సూచించారు. ఈదురు గాలులు, భారీ వర్షాలకు విద్యుత్ వైర్లు తెగిపడిన, కరెంట్ స్తంభాలు విరిగిపడిన తమకు సమాచారం అందిస్తే తక్షణమే పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పొతంగల్ ఏఈ ఫ్రకుతిన్ ఖద్రీ, లైన్ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ, లైన్‌మెన్ దినేష్, సిబ్బంది ప్రకాష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన పంటలను పరిశీలన



కోస్లీలో.. రాజంపేట మండలగ్రామాల్లో నెలకొరిగిన పంట

నవీపేట,మార్చి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నేలకొరిగిన వరిపంటను శనివారం ఏవో నవీన్ కుమార్ పరిశీలించారు. అకాల వర్షంతో పాటు ఈదురు గాలులతో గ్రామంలో పలుచోట్ల వరిపంట నేలకొరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈవో వినోద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేటమండలంలోని ఆరేపల్లి, బస్వన్నపల్లి, ఆర్గొండ గ్రామాలలో శుక్రవారం కురిసిన వర్షానికి మొక్కజొన్నపంట నేలకొరిగింది.శనివారం సంబంధిత గ్రామాల క్లస్టర్‌లలోఏఈవోలు సందర్శించినట్లు ఏవో శృతి తెలిపారు. మండలంలోని మొత్తం 26 ఎకరాలలో మొక్కజొన్న పంట నేలకు ఒరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు బాలకిషన్, సవిత,శిల్ప తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో దగ్ధమైన గుడిసె



అగ్ని ప్రమాదంలో కాలి బూడిద అయిన పూరిల్లు దృశ్యం

ఎడపల్లి, మార్చి22(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలో శనివారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన దండ్ల నర్సవ్వ పూరిల్లు(గుడిసె) పూర్తిగా కాలిపోయింది. ఈ సందర్భంగా బాధితురాలు నర్సవ్వ మాట్లాడుతూ తాను ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తన ఇల్లుకు నిప్పు పెట్టారని, ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు బియ్యం, బట్టలతోపాటు 30 వేల నగదు, రెండు తులాల బంగారం పూర్తిగా కాలి బూడిద అయ్యిందని బాధితురాలు బోరున విలపించింది. తనకు నిలువ నీడ లేకుండా పోయిందని తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె వేడకుకుంది. అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పారు.

ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ నాయకులు



నవీపేట ఇఫ్తార్ విందులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎడపల్లి, మార్చి22(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల కేంద్రంలోని మహమ్మదీయ మజీదు దగ్గర శనివారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులతో పాటు కాంగ్రెస్ నాయకులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనిఆస్‌తో పాటు పార్టీ నాయకులు సత్యనారాయణ, పాల్డ భాస్కర్ రెడ్డి, ఎల్లయ్య యాదవ్, జనగం మోహన్ రెడ్డి, గంగా ప్రసాద్, బంజ కామప్ప, బొబ్బిలి శ్రీనివాస్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని జామ మసీద్‌లో శనివారం సాయంత్రం ఇఫ్తార్ విందు నిర్వహించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతిరెడ్డి రాజిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు.

రైతాంగానికి ఇచ్చిన హామీలను పూర్తి చేయాలి

● ఈనెల 24న చలో అసెంబ్లీని విజయవంతం చేయండి
● ఆర్మూర్ డివిజన్ రైతు జేఏసీ నాయకుల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న రైతు జేఏసీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, మార్చి22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఈనెల 24న జగిత్యాల రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్ర మాన్ని ప్రతీఒక్క రైతు విజయవంతం చేయాలని రైతు జేఏసీ నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో రైతు జేఏసీ నాయకులు సమావేశం ఏర్పాటు చేసుకొని రైతు జేఏసీ నాయకులు ఇట్టెడి లింగారెడ్డి, వి.ప్రభాకర్, నక్కల భూమారెడ్డి, నవీన్‌రెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి అధికారంలోకి రావడానికి ఆరు గ్యారంటీలు, ఏడవ గ్యారంటీ ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు కట్టుబడి ఉంటామని హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగాన్ని నిర్లక్ష్యం చేశారని, రైతులకు ఇచ్చిన హామీల అమలు కొరకు ఈనెల 24న జగిత్యాల రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని అన్నారు. రైతుకు రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని చెప్పి 30నుంచి 40శాతం మాత్రమే పూర్తి చేశారని, రైతు భరోసా రూ.15వేలు ఇస్తానని చెప్పి రూ.12వేలు కూడా ఇవ్వడం రైతులను మోసం చేశారని, అన్ని పంటలకు క్వింటాలుకు రూ.500బోనస్ ఇస్తామని మాట తప్పి సన్నవడ్లకు పండించిన వారేకనని కొందరికే ఇచ్చి చేతులు దులుపుకోవడం సరైందికాదని, పసుపుకు రూ.12వేల ధర కన్న తక్కువ ఉంటే బోనస్ రూపంలో భర్తీ చేస్తామని హామీలను గుప్పించి రైతులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పసుపుబోర్డు తెచ్చారే గాని పసుపు మద్దతు ధర రూ.15 ఇప్పించడంలో వైఫల్యం చెందారని, ఎంఎస్‌పీ జాబితాలో పసుపును చేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతే రాజు అంటు అధికారాన్ని సొంతం చేశారని, రైతులకు ఒరబెట్టిందేమిలేదని ఆవేదనను వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు డి.రమేష్‌రెడ్డి, బి.దేవరాం, ఎస్.సురేష్, బి.కిషన్, బాబన్న, గంగారెడ్డి, తదిరతులు పాల్గొన్నారు.

26న బహిరంగ వేలం ప్రకటన

బోధన్‌రూరల్,మార్చి22(ఆంధ్రజ్యోతి): శ్రీ చక్రేశ్వర శివ మందిరం యొక్క పాండు తర్పాలో ఉన్న ఒక ఎకరం 35గుంటల సాగు భూములు రెండు సంవత్సరాల కాల పరిమితికి గాను బహిరంగ వేలంపాట ద్వారా కౌలు లీజు ఇచ్చుటకు శనివారం ప్రకటన జారీ చేశారు. ఈ నెల 26వ తేదిన ఉదయం 11గంటలకు ఏకచక్రేశ్వరాలయ శివాలయం కార్యాలయం నందు కౌలు వేలంపాట నిర్వహించబడుతుందని నిర్వాహణాధికారి తెలిపారు. ఆసక్తి గల వారు ముందుగా 2వేల రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

క్షయవ్యాధి రహిత గ్రామాలు మార్చడమే లక్ష్యం

బోధన్‌రూరల్,మార్చి22(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి రహిత గ్రామాలు మార్చడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పని చేయాలని బోధన్ డీఎల్‌పీవో నాగరాజు సూచించారు. శనివారం బోధన్ పట్టణంలోని గంజ్‌లో గల రైతు వేదికలో టీబీ ముక్త్ పంచాయత్ అభియాన్ డివిజన్ స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్య సంరక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డీపీవో విశాల రాణి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో రాజు, బోధన్ ఎంపీడీవో బాలగంగాధర్, ఎంపీవో మధుకర్, సాలూర ఎంపీడీవో శ్రీనివాస్, చందూర్ ఎంపీడీవో నీలావతి, కార్యదర్శులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో తైబజార్ వేలం

బోధన్‌రూరల్,మార్చి22(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం తైబజార్ వేలంపాటను నిర్వహించారు. 2025-26సంవత్సరానికి తైబజార్ వేలంపాట, పశువధ శాలకు సంబంధించిన బహిరంగ వేలంపాటను నిర్వహించారు. తైబజార్ వేలంపాటలో 32మంది పాల్గొనగా వేలంపాట హోరాహోరీగా కొనసాగింది. మహ్మద్ కబీర్ హైమద్ 23.45లక్షల రూపాయలకు తైబజార్ వేలంపాట పాడి దక్కించుకున్నాడని మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ తెలిపారు. జంతువధశాల వేలంపాటలో 14మంది పాల్గొనగా అబ్దుల్ అజీజ్ అనే వ్యక్తి 4.52లక్షల రూపాయలకు వేలంలో పాడి జంతువధ శాలను దక్కించుకున్నాడన్నారు.

భిక్కనూర్‌లో వారాంతపు సంత తైబజార్ వేలం

భిక్కనూరు,మార్చి 22(ఆంధ్రజ్యోతి):భిక్కనూరు పట్టణంలోని వారంతపు సంత తైబజార్ వేలం కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీఓ రాజ్‌కిరణ్‌రెడ్డి సమక్షంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఈవో మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ తైబజార్ వేలంపాటలో భిక్కనూరు చెందిన గజ్జె వేణు రూ.5.10లక్షలకు దక్కించుకున్నట్లు తెలిపారు. రోజువారి సంతకు సైతం వేలం నిర్వహించగా ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర వేలంలో రానందున సోమవారం నాటికి వాయిదా వేయడం జరిగిందన్నారు.

నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం పథకంలో అవకాశం కల్పించాలి

బోధన్‌రూరల్,మార్చి22(ఆంధ్రజ్యోతి): ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లకు అర్హులైన అగ్రవర్ణ కులాలలోని పేద నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం పథకంలో అవకాశం కల్పించాలని రెడ్డి ఐక్య వేదిక నాయకులు కోరారు. శనివారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఈడబ్ల్యూఎస్ అర్హులైన అగ్ర కులాల్లోని పేద నిరుద్యోగ యువతకు ఈ అవకాశం కల్పించాలని కోరారు.

పచ్చలనడ్కుడలో అనుమానాస్పదంగా ఒకరి మృతి



వివరాలను తెలుసుకుంటున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

వేల్పూర్,మార్చి22(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో వలస కూలీ శంకర్ (30) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందారు. ఎస్సై సంజీవ్ తెలి పిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన శంకర్, బాలాజీలు ఇద్దరు సుమారు తొమ్మిది నెలల క్రితం పచ్చలనడ్కుడ గ్రామానికి వలస కూలీలుగా వచ్చారు. వీరిరువురు గ్రామంలోని వేల్పూర్‌కు వెళ్లే రోడ్డు వద్ద ఒకే గదిని అద్దెకు తీసుకున్నారు. ప్రతీరోజు వ్యవసాయం, కట్టెలు కొట్టే కూలీ పనులు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. శనివారం ఉదయం నివాసముంటున్న ఇంటి నుంచి దుర్వాసన రావడంతో ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై సంజీవ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.గత గురువారం రాత్రి శంకర్, బాలాజీల మధ్య ఘర్షణ జరగడం వల్లనే శంకర్ హత్యకు దారి తీసి ఉండవచ్చని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ

మెండోర, మార్చి22(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌ప్రాజెక్టులో నిర్మల్ బాగ్యనగర్‌కు చెందిన శృతి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్టు ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం శృతి ఇంట్లో భర్తతో గొడవపడి కొడుకును తీసుకొని శ్రీరాంసాగర్‌ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. వెంటనే గమనించిన స్థానికులు తల్లి కొడుకును కాపాడి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నారాయణ సంఘటన స్థలానికి చేరుకొని శృతి కుటుంబసభ్యులకు సమాచారం అందించి వారి కుటుంబసభ్యులకు అందించారు.

బినోల సొసైటీ 63వ మహాజన సభ

నవీపేట,మార్చి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోల సొసైటీ 63వ మహాజన సభను శనివారం నిర్వహించారు. స్థానిక సొసైటీ ఆవరణలో జరిగిన మహజన సభలో పలు తీర్మానాలు ఆమోదించారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని, అర్హులైన రైతులకు రైతుబంధు చెల్లించాలని తీర్మానించారు. అలాగే నాడాపూర్‌లో నూతన గోదాం నిర్మించాలని, యాసంగి పంటలకు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, వైస్ చైర్మన్ బాబర్, పలువురు డైరెక్టర్లు, కార్యదర్శి రమేష్ తదితరులున్నారు.

అనుమతులు ఇచ్చి అడ్డుకోవడం సరికాదు

బోధన్‌రూరల్,మార్చి22(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వం కూని చేస్తుందని, అనుమతులు ఇచ్చి అడ్డుకోవడం సరికాదని కార్మిక సంఘాల నాయకులను పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా అరెస్టు చేయడం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. శనివారం కేంద్ర కార్మిక సఘాల పిలుపు మేరకు ఇందిరా పార్కు వద్ద గత ప్రభుత్వం 2021లో ఫైనల్ నోటిఫికేషన్‌లు ఇచ్చిన ఐదు కనీస వేతనాల జీవోలను గెజిట్ చేయాలంటూ ధర్నా కార్యక్రమానికి వెళ్తున్నప్పటికీ కార్మిక సంఘాల నాయకులను మల్లేష్,వరదయ్య, శంకర్ గౌడ్, సంజయ్‌లను శనివారం తెల్లవారుజామున అరెస్టు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వరదయ్యలున్నారు.

మోర్తాడ్‌లో పోస్టర్ల ఆవిష్కరణ

మోర్తాడ్, మార్చి22(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో శనివారం భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అమర వీరు లైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. పీవైఎల్ ఆధ్వర్యంలో దయాల్‌సింగ్ మాట్లాడుతూ సాయుధ విప్లవ వీరి పాత్ర ప్రత్యేకమని, భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యలను మార్క్సిజాన్ని జోడించి విశ్లేశించిన మహనీయుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. అమరవీరుల స్ఫూర్తితో వ్యవస్థా మార్పు కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులుఅరవిందసింగ్, నందినికౌర్, బల్విందర్‌సింగ్ పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

బోధన్‌రూరల్,మార్చి22(ఆంధ్రజ్యోతి):మండలంలోని అమ్దాపూర్ గ్రామానికి చెందిన బేగరిఅరుణ అనే మహిళను కులంపేరుతో దూషించిన జీలకరి జగదీష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. బాధితురాలు బేగరి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

యువకుడిపై కేసు నమోదు


భీమ్‌గల్‌రూరల్, మార్చి22(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఓగ్రామంలో మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన తీగల అక్షయ్ అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్టు భీమ్‌గల్ ఎస్సై మహేష్ తెలిపారు. ఎస్సై తెలిసిన విరవాల ప్రకారం శనివారం పురాణిపేట్ గ్రామంలో నేరస్థుడు ఇంటి దగ్గర ఉన్న మైనర్ బాలికను మాయమాటలు చెప్పి బలవంతంగా ఇంట్లోకి తీసుకుని వెళ్లి తలుపులు మూసివేయగా అసభ్య కరంగా ప్రవర్తించగా ఆ బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు తీయగా నిందితుడు తప్పించుకొని పారిపోయాడని తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మహేష్ తెలిపారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

నవీపేట,మార్చి22(ఆంధ్రజ్యోతి):మండల ఐకేపీ కార్యాలయంలో శనివారం మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానవ అక్రమ రవాణా, లైంగిక నేరాలు, సైబర్ ఆధారిత కేసులపై మండల మహిళ సమాఖ్య సమావేశంలో సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సంబంధిత కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, ఏపీఎం, ఎస్ఐ వినయ్, ఏఎస్ఐ తదితరులున్నారు.

కమ్మర్‌పల్లి: మానవ అక్రమరవాణ నివారణ అంశంపై మహిళ సంఘాల సభ్యులకు, మహిళలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని ఐకేపీ వ్యవసాయ విభాగం జిల్లా డీపీఎం మారుతి అన్నారు. శనివారం కమ్మర్‌పల్లి మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మహిళలను చిన్నపిల్లలను అక్రమంగా ముంబయి, కలకత్తా వంటి పట్టణాలతో పాటు ఇతర దేశాలకు విక్రయిస్తున్నారి తద్వార వారు దుర్భార జీవితం గడుపుతున్నారని అన్నారు. ఈవిషయమై గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని, తీర్మాణాలు చేయించాలని, ఎలాంటి సైబర్‌నేరాలు జరిగనా బెదిరింపులకు పాల్పడినా ఈ విషయాన్ని 1930 సైబర్‌కాల్ సెంటర్‌కు సమాచారం అందించిన వారి సహయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రోజారాణి, సీసీలు రవికుమార్, పీర్యా, భాగ్యలక్ష్మీ, సిబ్బంది ధనలక్ష్మీ, అనసూయ, గ్రామసమాఖ్యల అధ్యక్షురాళ్లు, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు



నవీపేట పది పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నవీపేట,మార్చి22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలోని ఏ సెంటర్, బీ సెంటర్‌లతో పాటు జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం అధికారులు తనిఖీ చేశారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, ఎంఈవో అశోక్, ఎస్ఐ వినయ్‌లు ఉన్నారు.

మోర్తాడ్: మండలంలో శనివారం జరిగిన పదవ తరగతి పరీక్షలలో 348 మంది విద్యార్థులకు గాను 348మంది హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి తమ్మిరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలలో ప్రశాంతం గా పరీక్షలు రాయడం జరిగిందని ఆయన తెలిపారు.

కోటగిరి: కోటగిరి మండలంలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో ఏ, బీ రెండు పరీక్ష కేంద్రాలలో శనివారం నిర్వహించిన హిందీ పరీక్షకు 322మంది విద్యార్థులకు గాను 322మంది విద్యార్థులకు హాజరయ్యారు. పొతంగల్ జిల్లా పరిషత్ పాఠశాలలో 181మందికి ఒకరు గైర్హాజరయ్యారు. రుద్రూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 148 మందికి 148మంది విద్యార్థులు హాజరయ్యారు. రుద్రూరు మోడల్ స్కూల్‌లో 240మందికి 239మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేశారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలో రెండవ రోజు జరిగిన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తె/మీ, ఉర్దూ మీడియం పాఠశాల, జానకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కలిపి 384మంది విద్యార్థులకు గాను 381 మంది విద్యార్థులు హజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేశారు.

భిక్కనూరు:భిక్కనూరు మండల కేంద్రంలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, ఎస్ఐ ఆంజనేయులు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలోని ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఆదరించాలి



మిర్దాపల్లిలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నసీం సుల్తాన

ఆర్మూర్‌రూరల్, మార్చి22(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ప్రేమగాఆదరించాలని ఆర్మూర్ కోర్టు సీనియర్‌సివిల్ న్యాయాధికారి నసీంసుల్తాన అన్నారు. శనివారం ఆలూర్ మండలం మిర్దాపల్లి గ్రామంలో మండల లీగల్ అవర్నెస్ కమిటీ బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీని యర్ సివిల్‌న్యాయాధికారి నసీం సుల్తాన హాజరై మాట్లాడుతూ ఒకే ఇంటి వారైన అన్నదమ్ముళ్ల ఆస్తుల విషయంలో బంధాలను మరిచిపోయి శత్రువు లుగా మారడం సరికాదన్నారు.కుటుంబసభ్యులందరు కలిసిమెలిసి ఉండి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు.సమస్యలు తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కారించుకోవాలని ఆమెసూచించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి అధికారులకు సహకరించాలన్నారు.ఈకార్యక్ర మంలో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, బ్యాంకుఅధికారులు,న్యాయవాదులు పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన టీయూసీఐ, సీఐటీయూ నాయకులు

ఆర్మూర్‌టౌన్,మార్చి22(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని టీయూసీఐ, సీఐటీయూ నాయకులను శనివారం ఉదయం స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేశా రు. కార్మిక సంఘాల పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇంద్ర పార్కు దగ్గర ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా ఉండడంతో టీయూసీఐ, సీఐటీయూ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో అసంఘటిత కార్మిక వర్గం కోటి మందికిపైగా ఉన్నారని, రాష్ట్రంలో పెరుగుతున్న ధరలతో చాలీచాలని జీతాలతో కార్మికులు సత మతమవుతున్నారని, 2021లో కేసీఆర్ ప్రభుత్వం ఐదు కనీస వేతన జీవోలకు ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం గ్రహించి తక్షణమే ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చిన ఐదు జీవోలకు గెజిట్ ముద్రించాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయినవారిలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఎం. ముత్తెన్న, జి.అర్వింద్, నజీర్, నికిల్, కుతాడి ఎల్లయ్యలు ఉన్నారు.

ఇసుక లారీ పట్టివేత

ఆర్మూర్‌టౌన్, మార్చి22(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని తెలిసిన సమాచారం మేరకుదాడులు నిర్వహించి ఇసుకలారీని పట్టుకున్నట్టు ఎస్‌హెచ్‌వో సత్య నారాయణ తెలిపారు.శనివారం పట్టణంలో ఎలాంటి ప్రభుత్వఅనుమతు లు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకొని సీజ్‌చేసిలారీ డ్రైవర్ చందు,యాజమాని వీరన్నలపై కేసునమోదుచేసినట్టు తెలిపారు.

యంత్రీకీకరణ సబ్సిడీ నిధుల మంజూరు

ఆర్మూర్‌రూరల్, మార్చి22(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు యంత్రీకరణ పథకంలో భాగంగా వ్యవసాయ పరికరాల సబ్సిడీకి రూ.20లక్షలు మంజూరు చేసిందని ఇన్‌చార్జీ ఏడీఏ సాయికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. భీమ్‌గల్ డివిజన్ పరిధిలోని గ్రామాలకు ఒక ట్రాక్టర్, 16రోటోవేటర్‌లు, 38హ్యాండ్‌స్ప్రెయర్‌లు, సీడ్ డ్రీల్ నాలుగు, కల్టివేటర్ 25, బండ్‌ఫార్మర్ ఒకటి, పవర్ వీడర్ ఒకటి, బ్రెష్ కటర్ ఒకటి, పవర్ టీల్లర్ ఒకటి, స్ట్రావీలర్ (గడ్డికట్టకట్టేది) ఒకటిమంజూరయ్యా యన్నారు. మహిళ రైతు కలు వీటిని అందజేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 50శాతం, ఓసీ, బీసీ 40శాతం సబ్సిడీపై అందజేస్తామన్నారు. రూ.లక్షలోపు పరికరాలు తీసుకునే వారు ఎకరంభూమి కలిగి ఉండాలా అంతకంటే ఎక్కు వ విలువైన వ్యవసాయ పరికరాలు తీసుకునే రైతులు రెండున్నర ఎకరాల భూమి కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల మహిళ రైతులు పట్టాపాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కారు జిరాక్స్‌లను జత చేసి తమ మండల వ్యవసాయాధి కారి కార్యాలయంలోదరఖాస్తు తీసుకోవాలని ఇన్‌చార్జీ ఏడీఏసాయికృష్ణ తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీలు

ఆర్మూర్‌టౌన్, మార్చి22(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయసేవ పథకం, రెడ్‌రిబ్బన్ క్లబ్ వారి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రించడంలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన,వ్యక్తిత్వ పోటీలు నిర్వహించినట్టు కళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ వై.వేణుప్రసాద్ తెలిపారు. అలాగే విద్యార్థులు ఎయిడ్స్ వ్యాధికి కారణమైన అంశాలు, ప్రజల్లో అవగాహన కల్పించడంలో యువత ఏ విధం గా భాగస్వా మ్యం కావచ్చే అనే విషయాలను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్, కార్యక్రమ సమన్వయ కర్త సునీత, అధ్యాపకులు డాక్టర్ జాన్‌సుకుమార్, వి.శ్యామ్ కుమార్, లత రమ్యశ్రీ, యాదగిరి, లావణ్య, స్వప్నప్రియాంక, జువెరియా,రాజన్న పాల్గొన్నారు.

అంబంలో ముగిసిన అఖండ హరినామ సప్తాహ

కోటగిరి,మార్చి22(ఆంధ్రజ్యోతి):రుద్రూరు మండలంలోని అంబంగ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహ శనివారంతో ముగిసింది. సప్తాహలో భాగంగా భజనలు, కీర్తనలు కొనసాగాయి. సప్తాహ ముగింపును పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారణ చాలా పవిత్రమైనది

బోధన్‌రూరల్,మార్చి22(ఆంధ్రజ్యోతి): హనుమాన్ మాలధారణ చాలా పవిత్రమైనదని వేద పండితులు ప్రవీణ్ మహరాజ్ అన్నారు. నిత్యం హనుమాన్ చాలీసా పటిస్తే కోరిన కోర్కెలు నెరవేరి సకల శుభాలు కలుగుతాయన్నారు. శనివారంతో 21రోజుల మాలధారణ వేసుకునే కార్యక్రమం పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, హనుమాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మెండోర, మార్చి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుస్సాపూర్ 44వ జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో జాదవ్ గజారాం(32) మృతి చెందినట్టు ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వాడని గత కొన్ని రోజులుగా మెండోరలో కూలీ పని చేసుకుంటూ ఉండేవాడని, మద్యానికి బానిసై గ్రామంలో తిరిగేవాడని బుస్సాపూర్ నుంచి పోచంపాడ్ జాతీయరహదారిపై నడుచుకుంటూ వెళ్లే క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడని తెలిపారు. మృతుడు తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సైబర్ నేరాలు, పోక్సోచట్టాలపై అవగాహన

భీమ్‌గల్‌రూరల్, మార్చి22(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాలపై డీపీఎం సాయిలు శనివారం భీమ్‌గల్ పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో అన్ని మహిళ సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను ు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, ముఖ్యంగా అడపిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. లైంగిక దోపిడి, అవయావాల దోపిడి పట్ల మహిళలను చైతన్యం చేయాలని గ్రామ సంఘాల అధ్యక్షులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రవీందర్, సీసీలు కుంట శ్రీనివాస్, పురస్తు నరేష్, గంగ, సాయిలు, గడాల రఘు, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో బాధిత కుటుంబాలకు పరామర్శ

వేల్పూర్, మార్చి22(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలో ఇటీవల మరణించిన పలు కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. ఏలేటి బల్క చిన్నారెడ్డి తన తండ్రి మల్లయ్య, అలాగే ప్రమోద్ వారి నాన్న ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు ఈ విషయం తెలుసుకున్న సునీల్‌కుమార్ శనివారం మృతుల కుటుంబాల ఇంటికి వెళ్ళి పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

ఫటా..ఫట్...

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

● రేణుక, మండల విద్యాధికారిణి, వేల్పూర్



ఆంధ్రజ్యోతి: మండలంలో ప్రభుత్వ పాఠశాలలు ఎన్ని ఉన్నాయి?

విద్యాధికారిణి: మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు తొమ్మిది, ప్రాథమికోన్నత పాఠశాలలు నాలుగు, ప్రాథమిక పాఠశాలలు 18, ఉర్దూ పాఠశాల ఒకటి ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మండల గ్రామాల్లో ప్రైవేటు పాఠశాలల సంఖ్య ఎన్ని కొనసాగుతున్నాయి?

విద్యాధికారిణి: మండల గ్రామాలలో ప్రభుత్వ అనుమతితో పది ప్రైవేటు పాఠశాలలు కొనసాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: పాఠశాలలో ఎంత మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు? పోస్టులు ఏమైన ఖాళీ ఉన్నాయా?

విద్యాధికారిణి: మొత్తం 32 పాఠశాలల్లో 178మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఏ పాఠశాలలో కూడా ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీ లేవు.

ఆంధ్రజ్యోతి: పాఠశాలలో విద్యార్థులు ఎంత మంది విద్యనభ్యసిస్తున్నారు?

విద్యాధికారిణి: ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 3003మంది, ప్రైవేటు పాఠశాలల్లో 2410మంది విద్యార్థులు విద్యనభ్యాసిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టు తెలుస్తుంది నిజమా?

విద్యాధికారిణి: ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం ఇచ్చే అనుమతి ప్రకారమే ఫీజులు తీసుకుంటారు. ఆ పాఠశాలలను పార్వెంట్స్ కమిటీ, మేనేజ్‌మెంట్ కమిటీల ద్వారా ఫీజుల తీసుకుంటున్న విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేశారు. క్లాసుల ప్రకారం ఆ పాఠశాలలో విద్యబోధనకు అవసరమైన వసతులను బట్టి ఫీజులు తీసుకోవడం జరుగుతుంది. ఎక్కడ అధిక కూడా అదిక ఫీజులు తీసుకుంటున్నట్టు తమ దృష్టికి రాలేదు.

ఆంధ్రజ్యోతి: మండలంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఎన్ని? ఎంత మంది పరీక్షలు రాయనున్నారు?

విద్యాధికారిణి: మండలంలో పడిగెల, వేల్పూర్, అంక్సాపూర్, పచ్చల నడ్కుడ, రామన్నపేట్ గ్రామాల్లో పాఠశాలలో పదవ తరగతి పరీక్ష నిర్వహణ కేంద్రాలను నిర్వహిస్తున్నాం. ఆయా కేంద్రాల్లో మొత్తం 507మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ● (ఆంధ్రజ్యోతి, వేల్పూర్)



నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయం



దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్న కార్యాలయం



25శాతం తగ్గింపు ప్రకటిస్తున్నట్లు ఫ్లెక్సీ

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు సదావకాశం

● 31 వరకు 25శాతం తగ్గింపుతో అవకాశం ● కార్యాలయంలో 10 హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు ● దరఖాస్తుల పట్ల ప్రజల్లో స్పందన కరువు ● ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వందకోట్లకు పైగా రానున్న ఆదాయం

సుభాష్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు మరో సదావకాశాన్ని ప్రకటించింది. మార్చి 31వరకు కట్టుకున్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు 25శాతం తగ్గింపునిస్తూ అవకాశాన్ని కల్పించింది. గత కొన్నేళ్లుగా ఎల్ఆర్ఎస్ దర ఖాస్తులు వేలల్లో పెండింగ్‌లో ఉండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ ఎస్ దరఖాస్తులను పూర్తిచేయడానికి 25శాతం తగ్గింపునిస్తూ ఎల్ఆర్ఎస్‌ను పూర్తిచేసే పనిని వివిధ శాఖలకు అప్పగించింది. దీంట్లో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు పేమెంట్ చేసేలా చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు నిజామాబాద్ నగరపాలక సంస్థలో మొత్తం 33,681మంది ప్లాట్లను క్రమబద్దీకరిం చేందుకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్లాట్లను క్రమబద్దీకరించేందుకు ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్ర వేశపెట్టింది. క్రమబద్దీకరణ కోసం వెయ్యిరూపాయల రుసుముతో ఎల్ ఆర్ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టి ప్రజల నుంచి దరకాస్తులు స్వీకరించింది. గ్రామస్థాయి నుంచి నగరపాలక సంస్థ వరకు ప్లాట్లను క్రమబద్దీకరిం చేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అప్పట్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ల కోసం క్యూలు కడుతూ దరఖాస్తులు చేసుకున్నారు. 2016లో మొద లైన పథకం అనుమతులు ఇవ్వడంలో మాత్రం నత్తతో పోటీపడు తుంది.

● 33,681 దరఖాస్తులు, అనుమతులు 1014 మాత్రమే

నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో ఎల్ఆర్ఎస్ అనుమతుల పరిస్థితి దారుణంగా తయారైంది. నగరపాలక సంస్థ పరిధిలో 2016 నుంచి మొత్తం 33,681 దరఖాస్తులు నమోదు కాగా వాటిలో కేవలం 1014కు మాత్రమే అనుమతులు వచ్చాయి. ఎనిమిదేళ్లకాలంలో కేవలం వెయ్యికి పైగా మాత్రమే అనుమతులు ఇచ్చారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతుల కోసం ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించినా అనుమతులు మాత్రం ఇవ్వడం లేదు. అధికారులు కొర్రీలు పెడుతున్నారని కొందరు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు వంద లోపే దరఖాస్తులు అనుమతులను ఇస్తున్నారు. ఎనిమిదేళ్లకు వెయ్యి దరఖాస్తులకు అనుమతులు ఇస్తే మిగతా దరఖాస్తులకు ఎన్ని సంవత్సరాలు పడుతుందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు శాఖల మధ్య సమన్వయలోపం ఇబ్బందులకు గురిచేస్తుంది. దీనిపై ఉన్నతాదికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

● 25శాతం తగ్గింపును ప్రజలు ఉపయోగించుకుంటారా

కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని 25శాతం తగ్గింపుతో వెసులుబాటును కల్పించింది. 25శాతం తగ్గింపు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు నగరంలో పలు కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహిస్తున్నారు. గత కొన్ని రోజులుగా నగరపాలక సంస్థ అధికారుల ప్రచారంతో టౌన్‌ప్లానింగ్ కార్యాలయం సందడిగా నెలకొంది. కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను పరిశీలించుకుంటూ అనుమతుల కోసం వేచిచూస్తున్నారు. అధికారులు సైతం దరఖాస్తుదారుల తాకిడి ఎక్కువవడంతో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఒక కౌంటర్‌ను, టౌన్‌ప్లానింగ్ కార్యాలయంలో 9కౌంటర్లతో మొత్తం 10కౌంట్లను ఏర్పాటు చేసి దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. దీనికితోడు దరఖాస్తుదారులు సొంతంగా మొబైల్‌లో కూడా దరఖాస్తుల పేమెంట్ కట్టుకోవచ్చని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే కార్యాలయానికి రావచ్చని ఇంచార్జి టీపీవో శ్రీనివాస్ తెలిపారు. మొబైల్‌లో పేమెంట్ చేసేవారు ఎల్ఆర్ఎస్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

● ఎల్ఆర్ఎస్ గడువును పెంచాలని కోరుతున్న ప్రజలు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ప్రభుత్వం ప్రకటించిన గడువుతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్చి 31 వరకు దరఖాస్తు ఫీజు చివరి తేదీ అని చెప్పడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్ఆర్ ఎస్ అప్లికేషన్ ఫీజులో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు చేస్తున్నారు. గడువు సమయాన్ని పొడగించాలని కోరుతున్నారు. డాక్యుమెంట్ వాల్యు ప్రకారం కాకుండా కంప్యూటర్ వాల్యుయేషన్ ప్రకారం జనరేట్ అయి ప్రజలకు, అధికారులకు ఇబ్బందికరంగా మారింది. దీనిపై ప్రజలు ఫిర్యాదు చేసినా ఎటువంటి రిప్లై రావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

● ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వందకోట్లకుపైగానే ఆదాయం

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు నగరపాలక సంస్థలో కుప్పలు తెప్పలుగా వచ్చిపడ్డాయి. మొత్తంగా 33,681 దరఖాస్తులు రాగా అందులో 1014 మాత్రమే పేమెంట్ అయ్యాయి. వీటి ద్వారా సుమారు. 5కోట్లకు పైగా ఆదాయం సమకూర్చింది. మిగతావాటికి కూడా డబ్బులు కడితే నగరపాలక సంస్థ పరిధిలో ఎల్ఆర్ఎస్ ద్వారా ఆదాయం వందకోట్లకు పైగా వచ్చే అవకాశం ఉంది.

● 25శాతం తగ్గింపును సద్వినియోగించుకోవాలి (శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్)

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ప్రభుత్వం కల్పించిన 25శాతం తగ్గింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దరఖాస్తుదారుల సౌకర్యార్థం కార్యాలయంలో 10 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశాం. మొబైల్ ద్వారా దరఖాస్తు డబ్బులను కట్టుకునే సౌకర్యం కల్పించాం. సమస్యలు ఉంటే కార్యాలయంలోని అధికారులను సంప్రదించండి.



మురికి కాలువలను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

చాలీ చాలని వేతనాలతో పనిచేస్తున్నాం

● గ్రామ పంచాయతీ కార్మికుల ఆవేదన

మోపాల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని వేతనాలతో కాలనీలను శుభ్రం చేస్తూ ప్రజలను ఆరోగ్య వంతులుగా ఉంచుతున్నా తమను మాత్రం పట్టించుకున్న వారే కరువయ్యారని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో కూడా తాము గ్రామ పంచాయతీలో ఉన్న చెత్తను తీయడంతో పాటు మురికి వాడలను శుభ్రం చేయడం జరిగిందని తెలిపారు. పంచాయతీ కార్మికులకు జీతభత్యాలు పెంచాలని ప్రభుత్వాలపై ఎన్నోసార్లు ఒత్తిడి తెచ్చిన జీతభత్యాలు పెంచడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు రోడ్లపై ఎన్నోసార్లు ఆందోళనలు, నిరసనలు చేశామని వారు పేర్కొన్నారు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పటికీ నేటికి తమ సమస్యలపై స్పందించలేకపోతున్నారని పంచాయతీ కార్మికులు మండిపడ్డారు. ఒక్కో గ్రామ పంచాయతీ కార్యాలయంలో 10 నుంచి 15 మంది కార్మికులుగా పనిచేస్తున్నారని వారు పేర్కొ న్నారు. గ్రామాల్లో ఏ మురికి వాడ పేరుకుపోయినా దానిని శుభ్రం చేయడం తమపైనే ఉంటుందని అన్నారు. గ్రామాల్లో ఎక్కడ చెత్త పరేసిన దాన్ని కూడా తొలగించాల్సిన బాధ్యత తమపైనే ఉంటుందని అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాల యాల్లో ఎంత పనిచేసినా పట్టించుకున్న వారే కరువయ్యారని అన్నారు.

ఎంపీ పేరును ఉచ్చరించే స్థాయిలేదు

ఆర్మూర్‌టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎంపీ అర్వింద్ పేరును ఉచ్చరించే స్థాయి టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్(చిన్నా)కు లేదని మాజీమున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్ బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవి.నర్సింహరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్‌లు అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వద్ద మన్ననలు పొందేందుకు ప్రెస్‌మీట్‌లు పెట్టి మాట్లాడడం సమంజసం కాదని, ఎన్నికల్లో షుగర్ ఫ్యాక్టరీ తెరిపి స్తాన్న మాటలు మోసపూరితమని, ప్రైవేటు స్థలాన్ని ప్రభుత్వ నవోదయ విద్యాలయానికి కేటాయించినప్పుడే రైతులపై ఉన్నటువంటి చిత్తశుద్ధి ఎంటో అర్థమవుతుందని, అభివృద్ధిని అడ్డుకొని విజన్‌లేని నాయకుడు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అని వారన్నారు. ఎంపీ అర్వింద్ మాట్లాడిన మాటలు ప్రతీఒక్కటి నిజమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, బీజేపీ నాయకులు పాన్‌శీను, పెంటయ్య, విజయానంద్, ఆరే రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అష్టైశ్వర్యాలు పొందాలంటే సూర్యుడి అనుగ్రహం ఉండాలి

● ఆచార్య గంగోత్రి రామానుజ దాసు స్వామి

మోపాల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం, పాడి పంటలు బాగుండాలంటే సూర్యుడి అనుగ్రహం పొందాలని ఆచార్య గంగోత్రి రామానుజ దాసు స్వామి అన్నారు. ఇందూరు తిరుమల 11వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఉదయం సూర్య ప్రభ వాహనంపై, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. సూర్యోపాసాన ద్వారా ఆరోగ్యం ఐశ్వర్యం ఇత్యాది లభిస్తాయని స్వామి అన్నారు. రాముడు సూర్యుడిని ఉపాసించి రావణుడితో యుద్ధం గెలిచాడని అన్నారు. ఆంజనేయుడు సూర్యుడిని ఉపాసించి సర్వశక్తివంతు డయ్యాడని అన్నారు. సత్ర జిత్తుడు సూర్యుడిని కొలిచే శమంతకమణిని పొందాడని గంగోత్రి స్వామి అన్నారు. చంద్రుడిని ఉపాసన చేస్తే వజ్రకాయలు అవతారు మరియు చంద్రుని వెన్నెలతో పంటలు ఇత్యాది ఔషద తుల్యంగా మారుతాయని అన్నారు. లోక క్షేమం బ్రహ్మోత్సవాల్లో ఆ దేవదేవుడు ఈరోజు సూర్య ప్రభ, చంద్రప్రభ వాహనాలపై వేంచేశారని అన్నారు. భగవంతుడి నిర్వహణలో ఏ లోటు ఉండదని ఆయన సృష్టి చాలా సౌందర్యంగా ఉంటుందని అన్నారు. అన్నింటిని తానే నియమించానని చూపెట్టడానికి సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై ఆ దేవదేవుడు వేంచే స్తాడన్నారు. ప్రపంచాన్ని చూపెట్టడానికి సూర్యుడిగా ఉదయి స్తాడని అంతర్యామిగా ఉన్న భగవంతుడే సూర్యునిగా ఉదయిస్తాడని వివరించారు. చంద్రప్రభ, గజవాహనంపై ఆలయ మాడ వీధు ల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవనాత జీయర్ స్వామి, ఆచార్య గంగోత్రి స్వామి, ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, విజయ సింహారెడ్డి, పృథ్వీ నర్సారెడ్డి, నరాల సుదాకర్, రాజేశ్వర్, ప్రసాద్, రమేష్, సాయిలు, భాస్కర్, మురళి, చిన్నయ్య, గంగారెడ్డి, రవి, యజ్ఞాచార్యులు శిఖామణి స్వామి, శ్రీకర్ కుమారాచార్యులు, రోహిత్ కుమారాచార్యులు, విజయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



చంద్రప్రభ వాహనంపై స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

● అభినందించిన ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సబ్‌జూనియర్ అండర్ 15 సాఫ్ట్‌బాల్ పోటీలకు జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన గన్న వర్షిణి ఎంపికయ్యారు. తైవాన్‌లో ఈ నెల 25నుంచి 30వ తేదీ వరకు జరిగే పోటీలలో గన్న వర్షిణి పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డిని గన్న వర్షిణి, నాయకులు కలిశారు. గన్న వర్షిణిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు నట్ట తిరుపతి, గన్న లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

గన్న వర్షిణికి ఆర్థికసాయం చేసిన నాయకులు

భారత జట్టు అండర్-15 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన గన్న వార్షిణి శనివారం సర్పంచ్‌ల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు గోర్త రాజేందర్ సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థినికి రూ.10వేల ఆర్థికసాయాన్ని గోర్త రాజేందర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి సింగిల్‌విండో చైర్మన్ కాట్‌పల్లి నర్సారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సందీప్, నందు, ప్రదీప్, రాజేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



వర్షిణిని అభినందిస్తున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే

నూతన సాంకేతిక విధానాలను నేర్చుకోవడం అభినందనీయం: డీఈవో



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈవో అశోక్

నిజామాబాద్ అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు నూతన సాంకేతిక విధానాలను నేర్చుకోవడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గాయత్రీనగర్‌లోగల విశ్వవికాస్ హైస్కూల్‌లో వి ఇగ్నయిట్ ఎక్స్పో 2కె25 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నూతన విధానాలను ప్రవేశపెడుతూ విద్యాబోధన చేయడం అభినందనీయమని వికాస్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. మారుతున్న కాలంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యతో పాటు సాంకేతిక విద్యను అందించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుశ్మిత మాట్లాడుతూ విశ్వవికాస్ విద్యార్థులకు ఎన్నోవేషన్ తెలపడం జరిగిందని, రోబోటిక్స్ కోడింగ్ యాక్షన్ ఎక్స్పో కటింగ్ విద్యార్థులు ప్రాజెక్టులు భవిష్యత్తు తరాలకు అందించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల ఆందోళన

మోపాల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికులు శనివారం మోపాల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. గత మూడు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులను పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సరైన సమయంలో జీతభత్యాలు అందకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వివరించారు. మురికి కాలువలను శుభ్రం చేయడంతో పాటు మురికి చెత్తను అంతా శుభ్రం చేస్తున్నామన్నారు. తాము మురికివాడలో పనిచేస్తున్నా తమను పట్టించుకునే వారు కరువయ్యారని వారు పేర్కొన్నారు. జీత భత్యాలు పెంచాలని గతంలో ఉద్యమాలు చేసి నిరసనలు, ఆందోళనలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు సరైన సమయంలో పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు.


గ్రామాల్లో జోరుగా కల్తీకల్లు విక్రయాలు

● మత్తు పదార్థాలతో శ్వాస కోస నరాల బలహీనత బారిన పడుతున్న వృద్ధులు ● పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతున్న కల్తీ కల్లు ● కల్తీ కల్లుకు బానిసై పెడదోవ పడుతున్న యువత ● పట్టించుకోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

తాడ్వాయి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో కల్తీకల్లు ఏరులై పారుతుంది. ముస్తేదారులకు మూడు పువ్వులు ఆరు కాయలుగా దందా నడుస్తుంది. గ్రామాల్లోని కల్లు దుకాణాల్లో విచ్చలవిడిగా మత్తు పదార్థాలు కలుపుతున్నారు. మత్తు పదార్థం కలపద్దని కలపనిదే కల్లు బానిసలు కళ్ళు ముట్టడం లేదు. మత్తు పదార్థాలు కలిపిన కల్లు తాగితే వృద్ధులకు శ్వాసకోస సంబంధిత వ్యాధులు వస్తున్నాయంటున్నారు. అలాగే నరాల బలహీనత కూడా వస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. పలు గ్రామాల్లో కల్లు తాగడం వల్ల శ్వాస కోస సంబంధిత వ్యాధులు వచ్చి ఆసుపత్రి పాలైన సంఘటనలు చాలా గ్రామాల్లోనే కనిపిస్తున్నాయి. గ్రామాల్లోని ప్రజలు కూలీ పనులు చేసుకుని రాత్రి ఫుల్లుగా కల్తీ కల్లు తాగి పచ్చని సంసారాల్లో చిచ్చు పెట్టుకుంటున్నారు. కల్తీ కల్లు తాగిన మైకంలో ఏమి చేస్తున్నారో కూడా అర్థం కావడం లేదు. గ్రామాల్లోని యువకులు కూడా కల్తీకల్లు తాగి పెడదోవ పడుతున్నారు. కల్లు దుకాణాల్లో కలిపే కల్లులో నీరు కూడా పరిశుభ్రంగా ఉండడం లేదని పలువురు అంటున్నారు. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. ముస్తేదారులు అధికారులకు నెలనెలా మామూలు అందుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక వేళ తనిఖీలకు అధికారులు వస్తే ముస్తేదారులకు ముందే సమాచారం వస్తుందని పలువురు అంటున్నారు. ఈ సమాచారం ఎవరు ఇస్తున్నారు అనేది సందేహంగా ఉంది. ఎక్సైజ్ అధికారుల్లోని సిబ్బంది ఇస్తున్నారా? ఇంకెవరైనా ఇస్తున్నారా? అని పలువురు చర్చించుకుంటున్నారు. ఇదంతా జరుగుతున్న అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఏదో నామ్కే వాస్తేగా వచ్చి కళ్ళు శాంపిళ్లను సేకరిస్తున్నారు. కానీ కల్తీకల్లు అని తేలి తే వారి మీద ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. మచ్చు కకు గ్రామస్థులు కూలి పని చేసుకుని తిరిగి ఇంటికి వస్తే కళ్ల తాగి తేనే మంచిగా నిద్ర పడుతుంది అని చెప్పడం ఎంత మత్తు మందు కలుపుతున్నారో అర్థం అవుతుంది. అలాగే ప్రధాన రహదారి వెంట లొట్ల కళ్ళు మాటున కల్తీ కల్లు కూడా అమ్ముతున్నారు. ఇదే అదునుగా చూసుకొని ప్రయాణికులు మంచి కల్లు అనుకొని తాగితే మత్తు వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదంతా బహిరంగం గానే జరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు ముస్తే దారుల నుంచి అధికారులకు నెలనెలా మామూలు అందు తున్నాయని బహిరంగం గానే అనుకుంటున్నారు. ఇకనైనా అధికారులు తనిఖీలు నిర్వహించి కల్తీకల్లును అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుకుంటున్నారు.



కల్లు దుకాణాల్లో అమ్ముతున్న కల్లు



ప్రధాన రహదారి వెంట అమ్ముతున్న లొట్ల కల్లు



వివరాలను సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

ధర్పల్లిలో 265 ఎకరాల్లో పంట నష్టం

● ఏడీఏ ప్రదీప్‌కుమార్

ధర్పల్లి, మార్చి22 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసన వడగండ్ల వానతో 265ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు నిజామాబాద్ రూరల్ డివిజన్ ఏడీఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శనివారం పంటనష్టం జరిగిన ప్రాంతాల్లో ఆయన మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్, వ్యవసాయ బృందంతో కలిసి పరిశీలించారు. మండలంలోని మద్దుల్‌తాండా, వాడి, ఒన్నాజిపేట్, గుడితాండాలలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పంటనష్టాన్ని అంచనా వేశారు. 175 మంది రైతులకు సంబంధించి 265 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. పంటనష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఏడీఏ తెలిపారు. పొట్ట దశలో ఉన్న పంటకు వడగండ్ల వాన వల్ల తీవ్రంగా దెబ్బతిందని ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు తెలిపారు. వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులు తమకు ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటను చివరి నిమిషంలో వడగండ్ల వాన తీవ్రంగా దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం: ఆర్డీవో

ఆర్మూర్‌రూరల్, మార్చి22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ కాలనీల్లో గ్రామాలలో సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవ సంస్థ సర్టిఫికెట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాజాగౌడ్ మాట్లాడుతూ సేవ కార్యక్రమాలను కాలనీల్లోనే కాకుండా గ్రామాలకు సైతం విస్తరింపజేయాలని సూచించారు. స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఏడాది కాలంగా జర్నలిస్టు కాలనీలో శ్రమదానం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, నూతన స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లోని 36వార్డుల్లో సేవ కార్యక్రమాఉల చేపడతామన్నారు. అంతేగాకుండా రక్తదాన శిబిరాలు,ఉచిత వైద్యశిబిరాలను సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, సభ్యులు నూకల ఉమాపతి, భోజన్న, కుంట గంగామోహన్‌రెడ్డి, షేక్ జహీరొద్దీన్, నిశాంత్‌కుమార్, మధుసూదన్, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం



నామినేషన్ వేస్తున్న దృశ్యం

నిజామాబాద్ లీగల్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): జిల్లాబార్ అసోసియేషన్ 2025-26వ వార్షిక ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉత్తర్వుల మేరకు జిల్లా బార్ అసోసియేషన్ అడహక్ కమిటీ చైర్మన్ ఆకుల రమేష్, సభ్యులు బాస రాజేశ్వర్, జి.నర్సింహారెడ్డి, శ్రీఆచార్య ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులుగా సీనియర్ న్యాయవాదులు జె.వెంకటేశ్వర్, ఆర్‌ఎస్‌ఎల్ గౌడ్ కోర్టు ప్రాంగణంలోని బార్ ఎన్నికల కార్యాలయంలో నామినేషన్లను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. బార్ ప్రధాన కార్యదర్శిగా బి.మానిక్‌రాజు, క్రీడల కార్యదర్శిగా మంజిత్‌సింగ్, కార్యవర్గ సభ్యునిగా మద్దెపల్లి శంకర్ నామినేషన్ పత్రాలను ధాఖలు చేశారు. మార్చి 26 వరకు నామినేషన్ పత్రాలు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా అడ్వకేట్ ఎన్నికల సొసైటీ అధికారులుగా ఎర్రం విఘ్నేష్, సహాయ ఎన్నికల అధికారికిగా బి.రవిని నియమిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు మాదస్సు రాజరెడ్డి తెలిపారు.

25న గిరిరాజ్ కళాశాలలో జాబ్‌మేళా


నిజామాబాద్ అర్బన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్, కెరీర్ గైడెన్స్ విభాగాల ఆధ్వర్యంలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్, శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లలో నియామకాల కోసం నిర్వహించే ఈ జాబ్‌మేళాకు ఏదైనా డిగ్రీ, బీటెక్‌లో 50 శాతం మార్కులు కలిగి ఉన్నవారు బ్యాంకు ఉద్యోగాల కోసం, పాఠశాల నియామకాల కోసం ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. మంగళవారం ఉదయం 10గంటలలోపు ఆసక్తిగల అభ్యర్థులు రెజ్యూమ్, సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకావాలని ఆయన తెలిపారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

సిరికొండ, మార్చి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తహసల్దార్ వెళ్లి విద్యార్థులు మాస్ కాపియింగ్‌కు పాల్పడకుండ పరిశీలన చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగే విదంగా చూడాలని ఇన్విజిలేటర్లను తహసీల్దార్ కోరారు. ఎలాంటి మాస్ కాఫీయింగ్ జరుగకుండా చూడాలని ఆయన సూచించారు.

దెబ్బతిన్న వరి పంట పరిశీలన

సిరికొండ, మార్చి22 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం సాయంత్రం వడగండ్ల వానతో దెబ్బతిన్న వరి పంటను వ్యవసాయ శాఖ సహాయక సంచాలకులు ప్రదీప్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి నర్సయ్య సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. రైతులు చెప్పినదాని ప్రకారం పంటనష్టాన్ని అంచనావేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశానుసారంగా కొండూర్, చిన్నావాల్గోట్, సిరికొండ, చీమన్‌పల్లి గ్రామాల్లో రైతులతో కలిసి రాళ్లవానకు నేల పాలయిన పంట పొలాలను పరిశీలించారు. నివేదికను తయారు చేసి జిల్లా అధికారులకు నివేదిస్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు.



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

ముగిసిన ఇంటర్ పరీక్షలు

● అధికారులను అభినందించిన కలెక్టర్, అదనపు కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించినందుకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌లు శనివారం డీఐఈవో రవికుమార్‌తో పాటు పరీక్షల నిర్వహణ కమిటీని అభినందించారు. రెగ్యూలర్ పరీక్షలు గురువారం ముగియగా వొకేషనల్ పరీక్షలు శనివారంతో ముగిసాయి. దీంతో ఇంటర్మీడియెట్ అధికారులు కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు కలిశారు. ఈ సందర్భంగా వారిని కలెక్టర్ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నిర్వాహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్ మూల్యాంకనం

ఈనెల 24వ తేదీ నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమవుతుందని డీఐఈవో రవికుమార్ తెలిపారు. అధ్యాపకుల ఆర్డర్ కాపీలను ఇంటర్ బోర్డు ఆయా కళాశాలల లాగిన్‌లలో ఉంచిందని వెంటనే ఆర్డర్‌లను డౌన్‌లోడ్ చేసుకొని 24వ తేదీ ఉదయం 10.30లకు మూల్యాంకన కేంద్రంలో ఫిజిక్స్, ఎకనామిక్స్ లెక్చరర్లు రిపోర్ట్ చేయాలన్నారు. రిలీవ్ చేయని ప్రైవేటు కళాశాలలపై ఇంటర్‌బోర్డు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ అధ్యాపకుల సంఘంలో చేరిన జూనియర్ అధ్యాపకులు

పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల చేరిన 46మంది ప్రభుత్వ అధ్యాపకుల సంఘంలో చేరారు. ఈ మేరకు శనివారం ఖిల్లా బాలుర జూనియర్ కళాశాలలో జిల్లా ప్రభుత్వ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని సంఘంలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐఈవో రవికుమార్, జిల్లా అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు నర్సయ్య, ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్‌కుమార్

పీఎం కుసూం దరఖాస్తుదారులకు అవగాహన

సుభాష్‌నగర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): పీఎం కుసూం దరఖాస్తుదారులతో రెడ్‌కో ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని పవర్‌హౌజ్ కంపౌండ్ గోల్డెన్‌జూబ్లీ మీటింగ్ హాల్‌లో అడిషనల్ కలెక్టర్ అంకిత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులకు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అవసరమైన సాంకేతిక విషయాలపై బ్యాంక్ లోన్‌కు సంబంధించి దరఖాస్తుదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఈ రాపెల్లి రవీందర్, డిస్ట్రిక్ రెడ్‌కో మేనేజర్ రమణ, ఎస్‌బీఐ లీడ్ మేనేజర్ అశోక్ చౌహాన్ పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అగ్రవర్ణాల పేదలకు అవకాశం కల్పించాలి'

ఖిల్లా, మార్చి22 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాస్ పథకాన్ని అగ్రవర్ణాలలోని నిరుపేద యువతీ యువకులకు వర్తించేలా అవకాశాన్ని కల్పించాలని రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఓఎస్‌డి విద్యాసాగర్‌లను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ పథకాన్ని అగ్రవర్ణాలలోని పేదలకు వర్తింపజేసే విధంగా ప్రభుత్వ పెద్దల దృష్టికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియజేయాలని కోరారు. ఈ విషయంపైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి దృష్టికి తీసుకెళ్తానని ఓఎస్‌డి విద్యాసాగర్ తెలిపారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్రకోశాధికారి పాపిరెడ్డి ఉన్నారు.

రాజీవ్ యువవికాసం కోసం దరఖాస్తులు చేసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రాజీవ్ యువ వికాసం పథకం కోసం జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగోరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన, ఆసక్తిగల నిరుద్యోగులు టీజీఓబీఎంఎంఎస్‌న్యూ.సిజిజి.జివోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా కలెక్టరేట్‌లోని 2వ అంతస్తులో గల రూమ్ నెంబర్ 207, 208లోగల జిల్లాగిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

'పోరాటాల వల్లే వర్గీకరణ సాధ్యమైంది'

సిరికొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ మందకృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు దీపక్ అన్నారు. సిరికొండ మండలం రామడుగు గ్రామంలో శనివారం మందకృష్ణా మాదిగ చిత్రపటానికి ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



సీపీకి మొక్కను అందజేస్తున్న నాయకులు

సీపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.సాయిచైతన్యను శనివారం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడాచైర్మన్ కేశవేణు సీపీకి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారితోపాటు నాయకులు కొండపాక రాజేష్, వేణురాజ్ సీపీని కలిసిన వారిలో ఉన్నారు.

'రైతు సంఘం సభను విజయవంతం చేయాలి'

ఖిల్లా, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25నుంచి 27వరకు జరిగే రాష్ట్ర రైతు సంఘం బహిరంగ సభలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజరభూమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యలయంలో విలేకరులతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఈ మహాసభల్లో చర్చించడం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే బహిరంగ సభతో పాటు ర్యాలీల్లో రైతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. 26, 27 తేదీల్లో బీఎల్ఎన్ గార్డెన్‌లో మహాసభలు కొనసాగుతాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పి. సుధాకర్, అడ్డిగే రాజేశ్వర్, వై.రాజిరెడ్డి, కోహెడినర్సింహులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మా భూమి రథయాత్ర కరపత్రాల ఆవిష్కరణ

సుభాష్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 14న విశారధన్ మహారాజ్ ప్రారంభించనున్న లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర కరపత్రాలను డీఎస్పీ జిల్లాఅధ్యక్షుడు మహిపాల్ మహారాజ్ ఆవిష్కరించారు. జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బీసీ,ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికారం కోసం ప్రజాసమస్యల పరిష్కారం కోసం డాక్టర్ విశారధన్ మహారాజ్ లక్ష కిలోమీటర్ల పాదయాత్ర ఆదిలాబాద్ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు 3సంవత్సరాల మూడు నెలలు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రేమ్‌కుమార్, మురళి, ప్రశాంత్, మహేష్, పోచయ్య, మహిపాల్, కిషన్ పాల్గొన్నారు.

రెండోరోజు పదవ తరగతి పరీక్ష ప్రశాంతం

నిజామాబాద్ అర్బన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా జరుగుతున్న పదవ తరగతి పరీక్షలు రెండవ రోజు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30ల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించిన సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు మొత్తం 22,724 మంది హాజరు కావాల్సి ఉండగా 22,685 మంది హాజరుకాగా 39 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడ కూడా మాస్ కాపీయింగ్ కేసు నమోదు కాలేదు. జిల్లాపరిశీలకుడు 5 పరీక్షాకేంద్రాలను, డీఈవో 7పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 41పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశాయి.

'క్రీడల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధిని కేటాయించాలి'

ధర్పల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడల కోసం ప్రత్యేక నిధిని కేటాయించాలని ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ నాయకురాలు సంధ్య అన్నారు. శనివారం మండలకేంద్రంలో పీవైఎల్, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ, చెస్‌పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసంపదను ప్రైవేటు వ్యక్తుల సంపదను పెంచే విధంగా చేస్తున్న చర్యలను మానుకోవాలని నేటి యువత రేపటి భవిష్యత్తు అనే వియాన్ని మర్చిపోవద్దని ఆమె గుర్తు చేశారు. సామ్రాజ్యవాద క్రీడ క్రికెట్‌పై మోజు పెంచే చర్యలను మాని గ్రామీణ క్రీడల అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బేటీ బచావో బేటీ పడావో అని నినాదించే కేంద్ర మంత్రులు మహిళా రెజ్లింగ్ క్రీడాకారులను లైంగిక వేదింపులు చేసి దేశ ప్రతిష్టను దెబ్బతీసిన వారిని ఎందుకు శిక్షించడం లేదని ఆమె ప్రశ్నించారు. క్రీడలు శారీరకంగా మానసికంగా సామాజిక చైతన్యాన్ని పెంచే విధంగా తోడ్పడుతాయని అన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు, క్రీడల నిర్వాహణ ఇంచార్జి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బాలయ్య, దాసు, టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ సరిత ఉన్నారు.

దుఃఖాన్ని దిగమింగి.. పరీక్ష రాసి

నిజామాబాద్ అర్బన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): రక్తం పంచుకొని పుట్టిన చెల్లి బ్లడ్ క్యాన్సర్‌తో మృతిచెంది ఇంట్లో మృతదేహం ఉండగా ఆమె అన్న దుఃఖాన్ని దిగమింగుకొని పదవ తరగతి పరీక్ష రాసిన ఘటన శనివారం నిజామాబాద్ నగరంలో చోటుచేసుకుంది. నగరంలోని ఆదర్శనగర్‌కు చెందిన సాయిలు, వినోద దంపతులకు పల్లవి(12), లక్ష్మి ఘనసాయి ఇద్దరు పిల్లలు. పల్లవి గత కొద్దికాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతుండగా శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఒకవైపు చెల్లి మృతి చెందిన లక్ష్మి ఘనసాయి పదవ తరగతి పరీక్ష రాస్తుండటంతో అతను ఇబ్బంది పడవద్దనే ఉద్దేశ్యంతో శనివారం పరీక్ష రాశాడు. పరీక్ష పూర్తయిన అనంతరం పల్లవి అంత్యక్రియలు నిర్వహించారు. చెల్లి మృతిచెందిన విషయం తెలిసి దుఃఖాన్ని దిగమింగుకొని అన్న పరీక్షరాసిన ఘటన పలువురిని కంటతడి పెట్టించింది. లుకేమియా వ్యాధితో బాధపడి పల్లవి మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదం నింపింది. పల్లవి, లక్ష్మి ఘనసాయి ఇద్దరు స్థానిక అరబిందో పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్నారు. తల్లి గృహిణి కాగా, తండ్రి సాయిలు ఆటో నడిపిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు.

చెరువులో పడి మత్స్యకారుడి మృతి

మోపాల్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంచిప్ప గ్రామానికి చెందిన మత్స్యకారుడు సాయిలు (55) ప్రమాదవశాత్తుగా చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన సాయిలు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడని తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్రప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సిరికొండ, మార్చి22 (ఆంధ్రజ్యోతి) వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. సిరికొండ మండలంలోని కొండూర్ తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంటను శనివారం ఏఐయూకేఎస్ ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వడగళ్ల వానతో రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. అసలే భూగర్భ జలాలు అడుగంటి పోయిపంటలు ఎండిపోయి నష్టపోగా దీనికి తోడు వడగళ్ల వాన గురిసి మరింత కృంగదీసిందన్నారు. పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట ఏఐపీకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

పాస్‌పోర్టుకు కొర్రీలు!

(5వ పేజీ తరువాయి)

వ్యక్తిపై ఏ కేసులు లేకున్నా పీసీసీ జారీ చేయడంలో జాప్యం చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తుంటారని తెలిసింది.

● రూల్స్ మాట్లాడితే పెండింగ్‌లో పాస్‌పోర్ట్

పాస్‌పోర్ట్ పొందడానికి అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నా కొన్ని సందర్భాల్లో పాస్‌పోర్ట్‌ను అధికారి పెండింగ్‌లో పెడ్తుంటారు. విచారణ చేయడానికి వచ్చిన సదరు ఎస్‌బి అధికారితో పాస్‌పోర్ట్ దరఖాస్తుదారుడు రూల్స్ మాట్లాడితే ఆయన ఆ విషయాన్ని తటుకోలేక పాస్‌పోర్ట్ కోసం పెట్టిన ధృవీకరణ పత్రాలు సక్రమంగా లేవని పెండింగ్‌లో పెట్టి ఇబ్బందిపాలు చేస్తుంటారు.

● ఏళ్లుగా ఒకే విభాగంలో విధులు

ఏళ్ల తరబడి ఒకే విభాగంలో విధులు నిర్వహించడం వల్ల అధికారులు పాస్‌పోర్ట్ దరఖాస్తు చేసుకున్న వ్యక్తులతో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్మూర్ డివిజన్ ఎస్‌బి విభాగంలో పనిచేసే వారి నుంచి పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్మూర్ డివిజన్‌లో పాస్‌పోర్ట్‌ల జారీ ప్రక్రియ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతం నుంచి నిరుద్యోగ యువత ఎక్కువగా ఉపాధి కోసం గల్ఫ్ బాట పడుతుంటారు. దీంతో అధికారులకు అదే స్థాయిలో డబ్బులు కూడా వస్తుంటాయి. ఎస్‌బి విభాగంలో ఏళ్లుగా విధులు నిర్వహించడం వల్ల వారు చెప్పిందే వేదం అనే రీతిలో ఉంటుంది వారి వాలకం.

పోలీసు కేసులో ఉన్న వ్యక్తికి పాస్‌పోర్ట్ జారీ

జిల్లాకేంద్రంలోని ఓ పోలీసు స్టేషన్‌లో ఓ వ్యక్తిపై కేసు నమోదై ఉంది. అటువంటి వ్యక్తికి పాస్‌పోర్ట్ జారీ చేయడంతో ఆ వ్యక్తి ప్రస్తుతం ఏడు నెలలకు పైగా విదేశాల్లో పర్యటిస్తున్నాడు. ఆ వ్యక్తిపై పోలీసు కేసు ఉన్నప్పటికి ఎస్‌బీ అధికారులు పాస్‌పోర్ట్ జారీ చేసినట్లు తెలిసింది. అంటే ఎస్‌బీ అధికారులకు డబ్బులు ఇస్తే ఎవరికైనా పాస్‌పోర్ట్ జారీ చేస్తారనే అపవాదు మూటకట్టుకున్నారు.

● కొత్త సీపీ దృష్టి పెట్టేనా..

పోలీసు కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సాయిచైతన్య ఎస్‌బీ విభాగంలో జరుగుతున్న అవినీతి కార్యకలాపాలపై దృష్టి సారించాల్సిన అవసరమెంతైనా ఉంది. ఆ విభాగాన్ని ప్రక్షాళన చేస్తే సామాన్య ప్రజలకు న్యాయం జరిగే అవకాశం ఉంది.



మాట్లాడుతున్న డీఎల్పీవో శ్రీనివాస్

క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రజలను చైతన్యం చేయాలి

డిచ్‌పల్లి, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు క్షయ వ్యాధి నివారణకు ఈనెల 24న గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని గ్రామీణ ప్రజలను చైతన్య వంతులను చేయాలని డీఎల్పీవో శ్రీనివాస్ సూచించారు. శనివారం మానవత సదన్‌లో నిజామాబాద్ డివిజన్ పరిధిలోని కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందికి టీబీ వ్యాధిపై నివారణ సదస్సుకు డీఎల్పీవో శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. క్షయ వ్యాధి మందులు పూర్తిగా నయం అయ్యే వరకు వాడాలని అప్పుడే క్షయవ్యాధి నయం అవుతుందని ప్రజలకు వైద్య సిబ్బంది ప్రజలకు వివరించాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో రాథోడ్ తుకారం మాట్లాడు తూ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో 24న జరిగే కా ర్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ వోలు రామకృష్ణ, డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నీటిని సంరక్షించడం ప్రతీఒక్కరి బాధ్యత

నిజామాబాద్ కల్చరల్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకి వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా జీవనశైలిని మార్చుకోవాల్సిన పరిస్థితి ఉందని అందులో నీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. శనివారం నగరంలోని వినాయక్‌నగర్‌లోగల సంస్థ కార్యాలయంలో ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళికి జలమే బలమని జలం మనకు జీవన ఆధారం అని అలాంటి నీటి వనరులను కాపాడుకోకపోవడం మానవాళికి పెనుముప్పని అన్నారు. భూగర్భ జలాల కోసం ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకొని భూగర్భజలాలను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డిచ్‌పల్లి వారి ఆధ్వర్యంలో ఏప్రిల్ మొదటి వారంలో మహిళలకు ఉచితంగా టైలరింగ్, బ్యూటీపార్లర్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తిగల వారు ఆధార్, రేషన్‌కార్డు, పదోతరగతి మెమో, 5ఫోటోలతో తమ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని వారు కోరారు. పూర్తి వివరాలకు 08461 295428, నంబర్ కు సంప్రదించన్నారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.130	రూ.200	రూ. 220
వెన్‌కాబ్ (కిలో)	: రూ.140	రూ.210	రూ. 230

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.90,400	రూ.83,400	రూ.1030

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : చావా (తెలుగు) (10.00, 4.45, 10.45)
: అనగనగా ఆస్ట్రేలియాలో (1.20)
: షణ్ముఖ (8.05)
స్క్రీన్-2 : కోర్టు (10.05, 4.30, 7.35, 10.40)
: చావా (హిందీ) (1.10)
స్క్రీన్-3 : కిస్ కిస్ కిస్సిక్ (11.00, 7.30)
: షణ్ముఖ (1.50)
: ఆర్టిస్ట్ (4.30, 10.20)
స్క్రీన్-4 : సలార్ (10.20, 4.25, 10.30)
: పెళ్లికాని ప్రసాద్ (1.50, 7.55)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కోర్టు (1.40, 7.30, 10.30)
: ఆర్టిస్ట్ (4.35)
స్క్రీన్-2 : ఎవడే సుబ్రహ్మణ్యం (10.50, 4.30, 10.35)
: పెళ్లికాని ప్రసాద్ (1.40, 7.30)
స్క్రీన్-3 : ఎవడే సుబ్రహ్మణ్యం (1.30)
: ఆర్టిస్ట్ (7.30)
: సలార్ (10.20)

దేవి : పెళ్లికాని ప్రసాద్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : షణ్ముఖ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సలార్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : కోర్టు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్